ఫరెవర్ మిసెస్ ఇండియా తెలంగాణగా ఆది రమాదేవి

సిటీబ్యూరో, జనవరి 6 (నమస్తే తెలంగాణ) : ఫరెవర్ మిసెస్ ఇండియా తెలంగాణ విజేతగా ఆది రమాదేవి నిలిచారు. జైపూర్‌లో జరిగిన ఫరెవర్ మిసెస్ ఇండియా పోటీల్లో పాల్గొని ఆమె సత్తా చాటారు. ఈ టైటిల్ కోసం అనేక మంది పోటీపడ్డారు. తన టాలెంట్ ప్రదర్శించి.. సామాజిక అంశాలపై ఆమె అభిప్రాయాలను వెల్లడించి టైటిల్ విజేతగా నిలిచారు.

జీఐజీ ఆర్థిక వ్యవస్థది గణనీయమైన పాత్ర

సమావేశంలో పాల్గొన్న రిసెర్చ్ సెంటర్ డైరెక్టర్ సురేశ్ బాబు

మాదాపూర్, జనవరి 6: ఆర్థిక వ్యవస్థలోని రిటైల్ సేవా రంగంలో జీఐజీ ఆర్థిక వ్యవస్థ గణనీయమైన పాత్ర పోషిస్తుందని సెంటర్ డైరెక్టర్ సురేశ్ బాబు అన్నారు. కొండాపూర్ సీఆర్ ఫౌండేషన్‌లోని నీలం రాజశేఖర్‌రెడ్డి రీసెర్చ్ సెంటర్‌లో సోమవారం జీఐజీ వర్కర్స్‌పై సెమినార్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ..నీతి ఆయోగ్, నిపుణుల అభిప్రాయం ప్రకారం జీఐజీ ఆర్థిక వ్యవస్థ గత దశాబ్దంలో 450 బిలియన్ డాలర్ల (37 లక్షల కోట్లు) టర్నోవర్‌తో దేశంలో వేగంగా అభివృద్ధి చెందిందన్నారు. 77 లక్షల మంది తాత్కాలిక కార్మికులు, ఫ్రీ ల్యాన్సర్లకు ఉపాధి కల్పిస్తున్నదని, కార్మికులు ఎక్కువగా ఉబెర్, ఓలా, స్విగ్గీ, జోమాటో, అమెజాన్, ఫ్లిప్‌కార్ట్‌లతో పాటు ఇతర డిజిటల్ ప్లాట్‌ఫామ్‌ల్లో పనిచేస్తున్నారన్నారు. భారతదేశంలో ఈ సంఖ్య 2029-30 నాటికి 2.35 కోట్లకు లేదా మొత్తం శ్రామిక శక్తిలో 4.1 శాతానికి పెరుగుతుందని అంచనా వేయబడినట్లు తెలిపారు. అయినా కార్మికులు అసంఘటితంగా ఉన్నారన్నారు. కనీస వేతనాలు, ఇతర ప్రయోజనాలు లేని కష్టతరమైన పని పరిస్థితులను తరచుగా ఎదుర్కొంటున్నారని చెప్పారు.

నుమాయిష్‌లో తెలంగాణ స్టేట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన లీగల్ ఎయిడ్ అండ్ అడ్వైజ్ సెంటర్‌ను సోమవారం లీగల్ సర్వీసెస్ అథారిటీ ఎగ్జిక్యూటివ్ చైర్మన్, హైకోర్టు జడ్జ్ జస్టిస్ సుజయ్‌పాల్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో లీగల్ సర్వీసెస్ అథారిటీ మెంబర్ సెక్రెటరీ సీహెచ్ పంచాక్షరి, సిటీ సివిల్ కోర్టు చీఫ్ జడ్జి జస్టిస్ వై.రేణుక, రంగారెడ్డి జల్లా జడ్జి జస్టిస్ శశిధర్‌రెడ్డి, అథారిటీ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ కళార్చన, సెక్రెటరీలు జావేద్‌పాషా, కిరణ్‌కుమార్, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

-సిటీబ్యూరో, జనవరి 6(నమస్తే తెలంగాణ)

సమాజ్‌వాదీ రాష్ట్ర ఎస్సీ ఎస్టీ సెల్ అధ్యక్షుడిగా నర్సింగరావు

బంజారాహిల్స్,జనవరి 6: సమాజ్‌వాదీ పార్టీ తెలంగాణ రాష్ట్ర ఎస్సీ ఎస్టీ సెల్ అధ్యక్షుడిగా మదిరె నర్సింగరావు నియమితులయ్యారు. లక్నోలోని పార్టీ జాతీయ కార్యాలయంలో అధ్యక్షుడు అఖిలేశ్ యాదవ్ చేతులమీదుగా నర్సింగరావు సోమవారం నియామకపత్రాన్ని అందుకున్నారు.

విద్యుత్ సౌధ రీజినల్ అధ్యక్షుడిగా అబ్దుల్ ఖాదర్

ఎర్రగడ్డ, జనవరి 6: తెలంగాణ రాష్ట్ర విద్యుత్ ఉద్యోగుల సంఘం-1535 విద్యుత్ సౌధ రీజినల్ అధ్యక్షుడిగా అబ్దుల్ ఖాదర్‌ను సోమవారం నియమించినట్లు యూనియన్ ట్రాన్స్‌కో రాష్ట్ర అధ్యక్షుడు కళ్లెం శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా అబ్దుల్ ఖాదర్ మాట్లాడుతూ యూనియన్ నాయకులు వజీర్, సిర్ర ఆనంద్‌కుమార్, కళ్లెం శ్రీనివాస్‌రెడ్డి, సలీం సూచనల మేరకు ఉద్యోగుల సంఘం బలోపేతానికి కృషి చేస్తానన్నారు. ఉద్యోగులు మెరుగైన పని తీరును కనబర్చి సంస్థకు మంచి పేరు తెచ్చే విధంగా యూనియన్ పాటు పడుతుందన్నారు.

దేశంలో సంపద సృష్టించేది బడుగు వర్గాలే

సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి రాజా

మహాసభలో మాట్లాడుతున్న రాజా

ఖైరతాబాద్, జనవరి 6 : దేశంలో సంపద సృష్టిస్తున్నది 90 శాతం దళిత, ఆదివాసీ, బడుగు వర్గాలేనని సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి. రాజా అన్నారు. అఖిల భారత దళిత హక్కుల ఉద్యమం జాతీయ రెండో మహాసభలు ఖైరతాబాద్‌లోని విశ్వేశ్వరయ్య భవన్‌లో ప్రారంభమయ్యాయి. ముఖ్య అతిథిగా హాజరైన రాజా మాట్లాడుతూ ప్రపంచంలో ఎక్కడైనా మనిషి తల్లి గర్భం నుంచే పుడుతాడని, కానీ మన దేశంలో పుట్టిన ప్రతి బిడ్డ భవిష్యత్‌ను కులాలు నిర్ణయించే దౌర్భాగ్య పరిస్థితి ఉండటం దారుణమన్నారు. మనిషిగా పుట్టిన వారందరూ ఒకటే నన్న భావన వస్తే దేశంలో అంతరాలు తొలగిపోతాయన్నారు. పాలక ప్రభుత్వాలు పేద వర్గాల సంక్షేమాన్ని విస్మరించి.. పారిశ్రామిక వేత్తల సేవల్లో తరిస్తున్నాయని, ఫలితంగా పేదలు పేదలుగానే మిగిలిపోతున్నారన్నారు. భారతదేశం ఐదో శక్తివంతమైన దేశమని పదే పదే చెప్పే ప్రధాని, ఆ సంపద సృష్టిస్తున్న 90 శాతం అట్టడుగు ప్రజలను మాత్రం పట్టించుకోవడం లేదన్నారు. సీపీఐ జాతీయ నాయకురాలు అనీ ఆజా మాట్లాడుతూ ఈ కార్యక్రమంలో దళిత సోషన్ ముక్తి మంచ్ జాతీయ అధ్యక్షుడు రాధాకృష్ణన్, సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు, మహాసభల ఆహ్వాన కమిటీ చైర్మన్ ఎం. బాలనరసింహ, అఖిల భారత దళిత హక్కుల ఉద్యమం సంస్థ జాతీయ ప్రధాన కార్యదర్శి వీఎస్ నిర్మల్ కుమార్, నాయకులు, మాజీ ఎమ్మెల్యే ఎన్ రాజన్, జి. లతా, మనోజ్, దేవి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు తెలుసుకునేందుకు వికాస్ నీతి

యాప్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే మర్రి
త్వరలోనే టోల్ ఫ్రీ నంబర్ అందుబాటులోకి తెస్తామని వెల్లడి

బోయిన్‌పల్లి క్యాంప్ కార్యాలయంలో 'వికాస్ నీతి' యాప్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి

మల్కాజిగిరి, జనవరి 6: ప్రజల సమస్యలు పరిష్కరించడమే ప్రధాన లక్ష్యంగా పనిచేస్తున్నామని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి అన్నారు. సోమవారం బోయిన్‌పల్లిలోని క్యాంప్ కార్యాలయంలో ప్రజల సమస్యలు తెలుసుకునేందుకు 'వికాస్ నీతి' యాప్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ 'వికాస్ నీతి' యాప్ ద్వారా ప్రజలు తమ సమస్యలు నేరుగా తెలియజేయవచ్చన్నారు. యాప్ ద్వారా వచ్చిన విజ్ఞప్తులను పరిగణలోకి తీసుకుని యుద్ధప్రాతిపదికన పరిష్కరించడానికి కృషి చేస్తామన్నారు. కొత్త టెక్నాలజీతో ప్రజల వద్దకు యాప్ ద్వారా నేరుగా వెళ్తున్నామని, ప్రజల ఇంటి వద్దే సేవలు అందించేందుకు ఇదో ప్రయత్నమని అన్నారు. త్వరలో టోల్ ఫ్రీ నంబర్‌ను అందుబాటులో పెడతామని చెప్పారు. ప్రస్తుతం ప్రజలు దరఖాస్తు ద్వారా సమస్యలు తెలియజేస్తున్నారని, వారికి ఇబ్బంది కాకుండా ఇంటి నుంచి నేరుగా యాప్ ద్వారా తెలపడం వల్ల వారికి సౌకర్యంగా ఉంటుందని, సమస్యను పరిష్కరించిన తర్వాత వారికి నేరుగా యాప్ ద్వారా తెలియజేస్తామని తెలిపారు.

రైల్వే చక్రబంధం నుంచి విముక్తి

రైల్వే చక్ర బంధంలో నుంచి మల్కాజిగిరి నియోజకవర్గంలోని ప్రజలకు విముక్తి కల్పించడానికి త్వరలో వాజ్‌పేయినగర్, గౌతంనగర్, బొల్లారం, తుర్కపల్లిల్లో ఆర్‌యూబీలను నిర్మించేందుకు ప్రభుత్వంతో పాటు రైల్వే శాఖ అనుమతులు మంజూరు చేసిందని ఎమ్మెల్యే అన్నారు. మొదట్లో వాజ్‌పేయినగర్ వద్ద ఆర్‌యూబీని నిర్మించడానికి వేసిన ప్లాన్ వల్ల దాదాపు వందకు పైగా ఇండ్లు, అపార్టుమెంట్‌లకు నష్టం జరుగుతుందని గుర్తించామని అన్నారు. ఇండ్లు, అపార్టుమెంట్లకు నష్టం కాకుండా ప్లాన్‌ను మార్చడం వల్ల ఆరు ఇండ్లపై మాత్రమే ప్రభావం పడుతుందన్నారు.

అధికారుల నిర్లక్ష్యంతోనే అక్రమ నిర్మాణాలు

నిబంధనలను తుంగలోతొక్కి అడ్డగోలుగా భవనాలు నిర్మిస్తున్నారని, అధికారుల ప్రమేయంతో జరుగుతున్నట్లు గుర్తించామని, ప్రజలకు వాస్తవాలు త్వరలో తెలుస్తాయన్నారు. నియోజకవర్గం అభివృద్ధి కోసం రూ.10కోట్లు మంజూరు చేశారని, వాటిని జిల్లా ఇన్‌చార్జి మంత్రి శ్రీధర్‌బాబు ద్వారా ఖర్చు చేయాల నడం వల్ల కొత్త సమస్యలు వస్తున్నాయన్నారు. స్థానిక ఎమ్మెల్యే ద్వారా అభివృద్ధి పనులు చేస్తే ఫలితాలుంటాయని, తమకు సచ్చినవారితో అభివృద్ధి పనులు చేపడితే ప్రజాధనం వృథా అవుతుందన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు, సునీతా రాయు యాదవ్, శాంతిశ్రీనివాస్‌రెడ్డి, సబితాకిశోర్, మాజీ కార్పొరేటర్ జగదీశ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కిడ్నీ రోగులకు ఉపశమనం

అంబర్‌పేటలో డయాలసిస్ కేంద్రం.. ప్రారంభించిన ఎమ్మెల్యే కాలేరు

అంబర్‌పేట డయాలసిస్ కేంద్ర వైద్యులు సిబ్బందితో ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్

గోల్నాక, జనవరి 6: అంబర్ పేట నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న కిడ్నీ రోగులకు భారీ ఉపశమనం కలిగించామని ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ అన్నారు. ఎట్టకేలకు అంబర్‌పేటలో డయాలసిస్ సెంటర్ అందుబాటులోకి రావడం సంతోషంగా ఉందన్నారు. ఈ మేరకు సోమవారం అంబర్ పేట మున్సిపల్ కాలనీ మున్సిపల్ దవాఖానలో రూ.1 కోటి వ్యయంలో అధ్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ఏర్పాటు చేసిన ప్రభుత్వ డయాలసిస్ సెంటర్‌ను స్థానిక కార్పొరేటర్ విజయ్ కుమార్ గౌడ్ తో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాలేరు మాట్లాడుతూ..కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతూ ప్రతి నెలా వారానికి రెండు సార్లు అంటే నెలకు 6 నుంచి 8 సార్లు డయాలసిస్ కోసం దాదాపు రూ.30 వేల వరకు ఆర్థిక భారం భరించలేక తన వద్దకు ఆర్థిక సాయం కోసం పెద్ద ఎత్తున బాధితులు వచ్చే వారన్నారు. ఓ వైపు నగరంలోని ప్రభుత్వ దవాఖానాలో స్లాట్లు దొరక్క.. మరో వైపు ఆర్థిక భారంతో ప్రైవేటు దవాఖానాల్లో డయాలిసిస్ చేయించుకోలేక ప్రాణాలు పోవడం తనను ఆవేదనకు గురిచేసిందన్నారు. ఎలాగైనా అంబర్ పేటలో ఉచిత డయాలసిస్ సేవలు అందించాలన్న లక్ష్యంతో పట్టుబట్టి ఎట్టకేలకు ఇక్కడ డయాలసిస్ సెంటర్‌ను ప్రారంభించుకోవడం సంతోషంగా ఉందన్నారు. మున్సిపల్ దవాఖానలో రూ.50 లక్షల వ్యయంతో 5 బెడ్లతో కూడిన జపాన్ టెక్నాలజీతో తయారైన ఐదు అధునాతన డయాలసిస్ పరికరాలతో పాటు రూ.50 లక్షల వ్యయంతో ఆర్వో ప్లాంటు ఏర్పాటు చేశామని తెలిపారు.

సమస్యలు లేని నియోజకవర్గంగా తీర్చిదిద్దుతా..

ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

కాప్రా, జనవరి 6: ఉప్పల్‌ను సమస్యలు లేని నియోజకవర్గంగా తీర్చిదిద్దుతానని ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. సోమవారం కాప్రా డివిజన్ సీఎస్‌నగర్ కాలనీలో ఎమ్మెల్యే పాదయాత్ర చేశారు. కాలనీలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కాలనీలో రోడ్లు వేయించాలని, డ్రైనేజీ సమస్య తీర్చాలని, వీధి దీపాలు ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యేను స్థానికులు కోరారు. ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ కాలనీలో అన్ని సమస్యలు పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు బైరి నవీన్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు. అలాగే ఏఎస్‌రావునగర్ డివిజన్ టీఎస్ఐఐసీ కాలనీలో రూ.30లక్షలతో చేపట్టే కమ్యూనిటీ హాల్ మొదటి అంతస్తు నిర్మాణానికి స్థానిక కార్పొరేటర్ సింగిరెడ్డి శిరీషా సోమశేఖర్‌రెడ్డితో కలిసి ఎమ్మెల్యే భూమిపూజ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు సింగిరెడ్డి సోమశేఖర్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ కొత్తరామారావు తదితరులు పాల్గొన్నారు.

కాప్రా డివిజన్ సీఎస్‌నగర్ కాలనీలో పాదయాత్ర చేస్తూ స్థానిక సమస్యలు అడిగి తెలుసుకుంటున్న ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

కార్మికులకు కనీస వేతనం పెంచేందుకు కృషి

రాష్ట్ర కనీస వేతన సలహా మండలి చైర్మన్ జనక్ ప్రసాద్

చిక్కడపల్లి, జనవరి 6: రాష్ట్ర వ్యాప్తంగా కార్మికులు కనీస వేతనం పెంచేందుకు కృషి చేస్తామని తెలంగాణ రాష్ట్ర కనీస వేతన సలహా మండలి చైర్మన్ జనక్ ప్రసాద్ అన్నారు. ఆర్టీసీ క్రాస్ రోడ్స్‌లోని కార్మిక శాఖ కార్యాలయంలో తెలంగాణ ప్రభుత్వ కనీస వేతన సలహా మండలి సభ్యుల ప్రమాణ స్వీకారం జరిగింది. చైర్మన్ జనక్ ప్రసాద్, కార్మిక శాఖ అదనపు డాక్టర్ ఈ.గంగాధర్, కనీస వేతన సలహామండలి కార్యదర్శి శ్యాంసుందర్ జాజు హాజరయ్యారు. కనీస వేతన సలహా మండలి సభ్యులుగా శ్రీనివాస్‌రెడ్డి, ఈయరం పిచ్చిరెడ్డి, రాజు ముదిరాజ్, ఎస్.నరసింహారెడ్డి, ఎండీ యూసఫ్, యాజమాన్య ప్రతినిధి సభ్యులుగా మీలా జయదేవ్, నర్రా రవికుమార్, బాసని చంద్రప్రకాశ్, స్వతంత్ర సభ్యులుగా ప్రొఫెసర్ సి.రవి, ప్రొఫెసర్ వాసంతి, రంజిత్ ప్రకాశ్ ప్రమాణం స్వీకారం చేశారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న కోటి 20 లక్షల కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ కార్మికులకు కనీస వేతనాలు పెంచడం, వారి సంక్షేమం కోసం కృషి చేస్తామని చెప్పారు.

'తెలంగాణ నిరుద్యోగులకు అన్యాయం'

ఉస్మానియా యూనివర్సిటీ, జనవరి 6: ప్రత్యేక తెలంగాణ ఏర్పాటు అనంతరం ఉస్మానియా యూనివర్సిటీలో ఆంధ్ర వ్యక్తులకు పెద్ద పీట వేస్తుండడంపై విద్యార్థి సంఘాల నేతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల ఓయూలో జరిగిన పార్ట్‌టైం లెక్చరర్ ఉద్యోగ నియామకానికి నిబంధనలకు విరుద్ధంగా పరీక్ష నిర్వహించి, ఇంటర్వ్యూ నిర్వహించారని మండిపడుతున్నారు. ఇంటర్వ్యూలో మంచి మార్కులు వచ్చినా, రాతపరీక్షలో మెరిట్ పేరుతో ఆంధ్రా ప్రాంతానికి చెందిన వారికి ఉద్యోగాలు కట్టబెట్టి తెలంగాణ నిరుద్యోగులకు అన్యాయం చేస్తున్నారని చెప్పారు. ఇప్పటికైనా అధికారులు జరిగిన తప్పును సరిదిద్ది, తెలంగాణ యువతకు ఉద్యోగాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. లేనిపక్షంలో మరో ఉద్యమానికి శ్రీకారం చుడుతామని హెచ్చరిస్తున్నారు.

బీసీ బిల్లు కోసం పోరాడుదాం

బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్. కృష్ణయ్య

రవీంద్రభారతి: 56 ఏండ్లు దేశాన్ని పాలించిన కాంగ్రెస్ పార్టీ బీసీలకు చట్టసభలో రాజకీయ రిజర్వేషన్లు కల్పించకుండా తీరని ద్రోహం చేసిందని, పార్లమెంట్‌లో కులగణన బిల్లు రాకుండా చేసి దేశవ్యాప్తంగా ఉన్న బడుగు బలహీన వర్గాలకు తీరని నష్టం చేసిందని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య అన్నారు. సోమవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యవర్గ సమావేశం బోను దుర్గా నరేశ్ అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆర్. కృష్ణయ్య మాట్లాడుతూ రెండు తెలుగు రాష్ట్రాల బీసీలు పార్లమెంట్‌లో బీసీ బిల్లు కోసం తిరుగులేని పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు.

భవిష్యత్ అంతా ఏరోస్పేస్, ఆటోమోటివ్ ఇంజినీరింగ్‌దేనని, సరళ పద్ధతుల్లో విద్యార్థులు పరిశోధనల్లో పట్టుసాధించాలని వీస్‌క్యూ, గ్లింట్ సహ వ్యవస్థాపకుడు గౌతమ్ కుర్రా అన్నారు. బిట్స్ పిలానీ క్యాంపస్‌లో అత్యాధునిక పరిశోధన సదుపాయమైన నళిని కుర్రా విండ్ టన్నెల్ ఫెసిలిటీని సోమవారం ముఖ్య అతిథిగా హాజరైన గౌతమ్ కుర్రా ప్రారంభించారు. కార్యక్రమంలో బిట్స్ పిలానీ వీసీ రాంగోపాల్‌రావు, డైరెక్టర్ సౌమ్యో ముఖర్జీ , సియోరా అట్లాంటిక్, గ్లోబల్ టెక్నాలజీ లీడర్ రాజురెడ్డి, డీన్ మోగిశ్వరి పాల్గొన్నారు.

- జవహర్‌నగర్

మెట్రో వద్ద అక్రమ పార్కింగ్‌కు చెక్

సిటీబ్యూరో: మెట్రో స్టేషన్ల ప్రాంగణాల వద్ద తలెత్తుతున్న ట్రాఫిక్ సమస్యలపై హైదరాబాద్ మెట్రో సంస్థ దృష్టి పెట్టింది. ఇటీవల కాలంలో పలు స్టేషన్ల వద్ద మెట్రో ప్రయాణికుల రాకపోకలకు ఇబ్బంది కలిగించేలా వాహనాలను అక్రమంగా పార్కింగ్ చేస్తున్నారు. దీంతో రాకపోకలు కష్టంగా మారుతున్న నేపథ్యంలో... స్టేషన్ల కింద వాహనాలు మెట్లు, లిఫ్టులు, ఎస్కలేటర్ మార్గాలకు అడ్డంకి లేకుండా చర్యలు చేపట్టారు. ప్రస్తుతం ప్రధాన మెట్రో స్టేషన్ల వద్ద ఈ సమస్య ఎక్కువగా ఉండగా, వీటిని పరిష్కరించేలా, వాహనాలు స్టేషన్ ప్రాంగణంలోకి చొచ్చుకుని రాకుండా ఏర్పాట్లు చేస్తున్నారు. దీనికి పెడిస్ట్రేయన్ బాటలు, బొల్లార్డ్స్ ను నిర్మించేందుకు చర్యలు చేపట్టినట్లు మెట్రో వర్గాలు తెలిపాయి. విక్టోరియా మెమోరియల్ స్టేషన్ నుంచి చైతన్యపురి మెట్రో స్టేషన్ వద్ద, అదేవిధంగా, దిల్‌సుఖ్‌నగర్ నుంచి మూసారాంబాగ్ వెళ్లే మార్గంలో, ఉస్మానియా మెడికల్ కాలేజీ నుంచి నాంపల్లి మెట్రో స్టేషన్, మియాపూర్ నుంచి ఎర్రగడ్డ మెట్రో స్టేషన్ మార్గం, ఈఎస్ఐ నుంచి అసెంబ్లీ స్టేషన్ మార్గంలో ఫుట్‌పాత్‌లూ, బొల్లార్డ్స్ నిర్మించనున్నారు. దీంతో మెట్రో స్టేషన్ల నుంచి వచ్చిపోయే వారికి ఎలాంటి ఇబ్బంది లేకుండా ఉంటుంది. అయితే గత కొంతకాలంగా మరమ్మతులపై దృష్టి పెట్టకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొన్నారు.

'పర్మినెంట్ చేయండి'

మేడ్చల్ కలెక్టరేట్, జనవరి 6 : కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు, కార్మికులను పర్మినెంట్ చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాస్ డిమాండ్ చేశారు. సోమవారం మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్ ముందు సీఐటీయూ ఆధ్వర్యంలో కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు, కార్మికులు ధర్నా నిర్వహించారు. అనంతరం అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డికి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ జిల్లాలో మున్సిపాలిటీలు, మున్సిపల్ కార్పొరేషన్లలో 10 వేల మంది కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్, ఎన్ఎంఆర్ తదితర పద్ధతుల్లో ఉద్యోగులు, కార్మికులుగా పని చేస్తున్నారన్నారు. ఏండ్ల తరబడి పనిచేస్తున్నా..పర్మినెంట్ చేయడం లేదని, కనీస వేతనాలు అమలు కావడం లేదన్నారు. కార్మికులకు రక్షణ లేదని, అర్హత కలిగిన వారికి ప్రమోషన్లు ఇవ్వడం లేదని, ప్రమాదాలు జరిగి అనేక మంది కార్మికులు మరణిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికులు, ఉద్యోగులకు కనీస వేతనం అమలు చేయడంతో పాటు, వారి సమస్యలు పరిష్కరించాలన్నారు.

'పెండింగ్ బిల్లులు చెల్లించండి'

మేడ్చల్ కలెక్టరేట్: మధ్యాహ్న భోజన కార్మికుల పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని సీఐటీయూ రాష్ట్ర కోశాధికారి ఉన్నీకృష్ణన్ డిమాండ్ చేశారు. సీఐటీయూ ఆధ్వర్యంలో సోమవారం మేడ్చల్ కలెక్టరేట్ ముందు మధ్యాహ్న భోజన కార్మికులు ధర్నా నిర్వహించారు. అనంతరం జిల్లా విద్యాధికారి విజయకుమారికి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో మధ్యాహ్న భోజన కార్మికులకు ఇచ్చే గౌరవ వేతనం, విద్యార్థులకు ఇచ్చే మెనూ చార్జీలు పెండింగ్‌లో ఉన్నాయని, నెలల తరబడి బిల్లులు రాక అప్పులు చేసి వంట చేస్తున్నారన్నారు. కాంగ్రెస్ మ్యానిఫెస్టోలో ప్రకటించిన విధంగా కార్మికులకు రూ. 10 వేలు అమలు చేయాలని, పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలన్నారు. కార్యక్రమంలో భాగ్య, విజయలక్ష్మి, మంజుల, వసంత పాల్గొన్నారు.

కిమ్స్‌లో అరుదైన చికిత్స

మాదాపూర్, జనవరి 6: బాలికకు గుండె ..ఊపిరితిత్తుల మధ్య ఉన్న కణితిని తొలగించి బాలిక ప్రాణాలను కాపాడారు కిమ్స్ వైద్యులు. చీఫ్ సర్జన్, డాక్టర్ నిసర్గ, కన్సల్టెంట్ మినిమల్ ఇన్వేజివ్, ఆంకో థొరాసిక్ సర్జన్, డాక్టర్ సి. రోహన్‌రెడ్డి వివరాలను వెల్లడించారు. ఖమ్మం జిల్లాకు చెందిన రోజువారీ కూలీ చేసుకునే దంపతుల కుమార్తెకు పుట్టుకతోనే గుండెకు సంబంధిత సమస్యలు ఉన్నాయి. గుండె గదుల మధ్య గోడకు ఏర్పడిన పెద్ద రంధ్రం ఏఎస్‌డీ కూడా పుట్టుకతోనే ఉన్నప్పటికీ తల్లిదండ్రులు గుర్తించలేదు. బాలికకు ఆయాసం రావడంతో స్థానికంగా వైద్యులకు చూపించి వారి సూచనతో కిమ్స్ దవాఖానకు తీసుకురావడంతో వైద్యులు పరీక్షలు చేయగా, మెడియాస్టినల్ టెరటోమా కణితి ఉన్నట్లు గుర్తించారు. ఊపిరితిత్తులకు మధ్యలో గుండెకు ముందు భాగంలో ఈ కణితి ఏర్పడింది. ఇలాంటి టెరటోమా కణితిలు చాలా అరుదుగా కనిపిస్తుంటాయని వైద్యులు చెప్పారు. బాలికకు పరీక్షలు జరిపిన అనంతరం కణితితో పాటు ఏఎస్‌డీ ఉన్నట్లు తెలిపారు. అప్పటి వరకు బాలిక గుండెల్లో రంధ్రం ఉన్నట్లు తల్లిదండ్రులకు తెలియదు. ఈ రంధ్రం వల్ల చెడు, రక్తం, మంచి రక్తం కలిసే ప్రమాదం ఉందన్నారు. అలా జరిగినట్లయితే రక్త ప్రసరణకు సంబంధించి తీవ్రమైన సమస్యలు వస్తాయన్నారు. దీంతో వైద్యులు ముందుగా టెరటోమా కణితిని తొలగించేందుకు శస్త్ర చికిత్స చేసినట్లు తెలిపారు. ఇందుకు తక్కువ మోతాదులో కోత పెట్టినట్లు వైద్యులు వెల్లడించారు. కణితి అప్పటికే గుండెపై ఉన్న పొరను కవర్ చేయడంతో కొంత వరకు ఊపిరితిత్తులకు కూడా అతుక్కుపోయింది. పుట్టుకతోనే ఏర్పడే ఈ కణితులు ఎక్కువ కాలం గడిచే కొద్దీ ఊపిరితిత్తులకు వెళ్లే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. ఈ చికిత్సలో కీలకమైన నరాలు రక్తనాళాల మీదుగా ఎడమ వైపు కణితి వెళ్లింది. కొంత చిన్న భాగాన్ని మాత్రమే తీయడంతో ఊపిరితిత్తులకు ఎటువంటి ఇబ్బంది ఉండదని, మంచి, చెడు రక్తాలు కలిసి పోవడానికి కారణమవుతున్న గుండె రంధ్రాన్ని పూడ్చే పని మొదలుపెట్టినట్లు పేర్కొన్నారు. గుండెను కార్డియోపల్మనరీ బైపాస్ మెషన్‌తో అనుసంధానించి ఆ తరువాత గుండెపై పొరను ఉపయోగించి గుండె గదుల మధ్య గోడకు ఉన్న పెద్ద రంధ్రాన్ని పూడ్చివేసినట్లు తెలిపారు. శస్త్ర చికిత్స చేసిన 5 రోజులకే డిశ్చార్జీ చేసినట్లు వైద్యులు వెల్లడించారు.